ప్రజాశక్తి

మంగళవారం 30 జనవరి 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

అమరావతికి పూర్వవైభవం తెస్తా

- విధ్వంసం, వినాశనంతో జగన్ పాలన
- వైసిపి ఎమ్మెల్యేల అరాచకాలకు చెక్ పెడతాం
- ఆంబోతు అంబటికి కళ్లెం వేస్తాం
- 'రా కదలి రా' సభలో చంద్రబాబు



మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి/చేబ్రోలు

వైసిపి ఐదేళ్ల పాలనలో అభివృద్ధి లేదని, విధ్వంసం, వినాశకరమైన ఆలోచనలతో అరాచకాలను ప్రోత్సహించి ప్రజలను సిఎం జగన్ తీవ్రంగా ఇబ్బందికి గురిచేశారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆరోపించారు. సోమవారం సాయంత్రం చేబ్రోలు మండలం వడ్లమూడిలో జరిగిన 'రా కదలిరా' సభలో ఆయన ప్రసంగించారు. సభకు టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్యక్షత వహించగా చంద్రబాబు మాట్లాడుతూ జగన్ ఒక సైకో...ఆయనతో పాటు ఊరికో సైకో తయారయ్యాడని వీరంతా ప్రజలను దోచుకుంటున్నారని అన్నారు. సిఎంగా ప్రజల్లోకి వెళ్లలేని వ్యక్తి జగన్ ఒక్కరేనన్నారు. ఇప్పటికీ పరదాలు కట్టుకుని వెళ్లడం తప్ప స్వేచ్ఛగా బయటకురాలేరన్నారు. టిడిపి హయాంలో ఉచితంగా అందే ఇసుకను కేజీల లెక్కన అమ్ముకోవడం జగన్ మార్క్ అరచాకం అన్నారు. దళితుల్ని చంపి డోర్ డెలివరీ చేయడం మరో అరాచకమన్నారు. పోలవరం నాశనం చేసి అమరావతిని నిర్వీర్యం చేశారని, నాడు-నేడు పేరుతో పేద పిల్లలకు విద్యను దూరం చేయడం, ఉపాధ్యాయుల నియామకం లేకుండా విద్యా వ్యవస్థను నాశనం చేశారని విమర్శించారు. తనది విజన్ అని.. జగన్‌ది పాయిజన్ అని, తాను ఐటీని ప్రోత్సహించి కంపెనీలు తెస్తే.. జగన్ రెడ్డి ఐదువేలకు వాలంటీర్ ఉద్యోగాలిచ్చారని, ఫిష్ మార్టులు, మటన్ కొట్లు, మద్యం కొట్లు అంటూ యువత జీవితాలను ▶ 2లో

నూతన ఎస్‌పిగా తుషార్ దూడి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ బదిలీ అయ్యారు. ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌కు ఆయన్ను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా నూతన ఎస్పీగా కడప జిల్లా అదనపు ఎస్‌పిగా ఉన్న తుషార్ దూడి నియమితులయ్యారు. 2018 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన తుషార్ శిక్షణ అనంతరం పలు జిల్లాల్లో పనిచేశారు. ఐఐటి చదివి ఆ తరువాత సివిల్ సర్వీస్ పరీక్షలు రాసిన తుషార్ 2018లో ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. గతరెండేళ్లుగా అదనపు ఎస్‌పి (అడ్మిన్)గా కడపలో పనిచేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో తుషార్ జిల్లా ఎస్‌పిగా నియమితులయ్యారు. రెండ్రోజుల్లో ఆయన బాధ్యతల స్వీకరిస్తారని తెలిసింది.

మరోవైపు బదిలీ అయిన ఆరీఫ్ హఫీజ్ మూడేళ్లుగా జిల్లాలో పని చేస్తున్నారు. తొలుత ఎస్ఇబి అదనపు ఎస్‌పిగా, ఆ తరువాత అర్బన్ జిల్లా ఎస్‌పిగా, 2022 ఏప్రిల్ నుంచి విభజిత గుంటూరు జిల్లా ఎస్‌పిగా నియమితులయ్యారు. విధి నిర్వహణలో మెతక వైఖరి అవలంభించారనే విమర్శలు ఎదుర్కొన్నారు. అధికార పార్టీకి పూర్తిగా



తుషార్ దూడి.. ఆరీఫ్ హఫీజ్

అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలను కూడా ప్రతిపక్షాల నుంచి ఎదుర్కొన్నారు. టిడిపి కార్యాలయంపై, చంద్రబాబు ఇంటిపైనా వైసిపికి చెందిన ప్రజా ప్రతినిధుల దాడి వ్యవహారాలపై ఉదాశీనంగా వ్యవహరించారనే విమర్శలు లేకపోలేదు. మంత్రి విడదల రజిని కార్యాలయంపై దాడి చేసిన గంటల వ్యవధిలోనే 25 మందికి అదుపులోకి తీసుకున్న పోలీసులు, టిడిపి రాష్ట్ర కార్యాలయంపై దాడి చేసిన వారి విషయంలో పూర్తిగా ఉదాశీనంగా ఉన్నారనే విమర్శలు ప్రభలంగా ఉన్నాయి. శాంతిభద్రతల పరిరక్షణలో కూడా ముందుచూపుతో వ్యహరించలేకపోయారు. ప్రజా ఉద్యమాలపై ముందుగానే ఉక్కుపాదం మోపడం, ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధంపై దృష్టి సారించే ఆయన కొంతమంది ▶ 2లో

పసుపు రైతుల్ని ఆదుకోండి..

కోల్డ్‌స్టోరేజీలో పంట దగ్ధం ఘటనపై ఎంపీకి రైతుల వినతి 2 లో



5 లో

గుంటూరు ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

పెన్షనర్ల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

గౌరవప్రదమైన జీవితాన్ని దూరం చేస్తున్నారు - గుంటూరు కలెక్టరేట్ ఎదుట, పల్నాడులో భారీ ధర్నాలు, పల్నాడు కలెక్టర్‌కు వినతి

నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి

ప్రజాశక్తి - తాడికొండ

బాలికపై యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. సిఐ ప్రభాకర్‌రావు వివరాలు ప్రకారం.. మండలంలోని రావెలకు చెందిన బాలిక ఆదివారం తమ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా సమీపంలో ఉన్న 18 ఏళ్ల నక్కా గోపి అనే యువకుడు బాలికకు మాయ మాటలు చెప్పి ఇంట్లోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఇంటి నుండి బయటకు వచ్చి వాంతులు చేసుకుంటుండగా గమనించిన తల్లి.. బాలికను అడిగి విషయం తెలుసుకుని నిందితుడు గోపిని నిలదీసింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న నిందితుడు ఆమెను దూషిస్తూ రాళ్ల దాడికి దిగాడు. దీంతో బాధిత బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాలికను వైద్య ▶ 2లో

నేటి నుండి ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు

గుంటూరు జిల్లాలో 1.43 లక్షల ఇళ్ల స్థలాలు మంజూరు

ప్రజాశక్తి-గుంటూరు



జిల్లాలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో మంజూరు చేసిన స్థలాల రిజిస్ట్రేషన్‌కు పకడ్బందీగా, ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, వైద్యారోగ్యశాఖ, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ, విద్యాశాఖలపై సబ్ కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా, మండలస్థాయి అధికారులతో జెసి రాజకుమారితో కలిసి కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్షించారు. జిల్లాలో పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా దాదాపు 1,43,000 స్థలాలు మంజూరు చేసి పట్టాలు అందించామని, అన్నింటినీ రిజిస్ట్రేషన్ చేసి రిజిస్ట్రేషన్ డీడ్‌లో అందించాల్సి ఉందని అన్నారు. రిజిస్ట్రేషన్‌కు ముందు స్థలాలకు హద్దులు, మ్యాపింగ్ పెండింగ్ లేకుండా వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. సోమవారం సచివాలయాల్లో మాక్ రిజిస్ట్రేషన్ నిర్వహించామని, మంగళవారం నుంచి క్లస్టర్ల వారీగా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని అన్నారు. మంజూరు చేసిన ఇళ్లకు అనుగుణంగా రిజిస్ట్రేషన్లు ఫిబ్రవరి 9వ తేదీ నాటికి పూర్తి చేసేందుకు అవసరం మేరకు కంప్యూటర్లు, అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలలో మౌలిక సౌకర్యాల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు.

వరికపూడిశెల పనులు ప్రారంభించండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

వరికపూడిశెల ప్రాజెక్టు పనులను వెంటనే చేపట్టాలని, దీనిపై మంత్రి మండలిలో చర్చించి నిధులు కేటాయించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును ప్రాజెక్టు పోరాట సాధన కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రిని స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు వి.కోటానాయక్, పి.రూబెన్, కె.హనుమంతరెడ్డి, ▶ 2లో



మంత్రి అంబటి రాంబాబుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మిర్చి యార్డులో ఉచిత భోజనం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో రైతులకు ఉచితంగా అల్పాహారం, భోజనం అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సోమవారం ప్రారంభించారు. ఉచిత భోజనంతోపాటు, వైద్యశాల, యార్డులో విద్యుద్దీకరణ టవర్ లైట్స్‌ను, మినరల్ వాటర్ కేంద్రాలను మంత్రి అంబటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ▶ 2లో



సభలో ప్రసంగిస్తున్న మంత్రి అంబటి రాంబాబు



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు మన్నవ మోహనకృష్ణ, నరేంద్ర, తెనాలి శ్రావణ్‌కుమార్

చంద్రబాబుకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చేబ్రోలు మండలం వడ్లమూడికి వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబుకు ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాజమండ్రి నుంచి హెలికాప్టర్‌లో చంద్రబాబు సోమవారం సాయంత్రం వడ్లమూడికి చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద టిడిపి రాష్ట్రనాయకులు, రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర, జిల్లా నాయకులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, నక్కాఆనంద్‌బాబు, దూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్‌కుమార్, మన్నవ మోహన్‌కృష్ణ, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, జిల్లాకు చెందిన పలువురు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు.

కన్నాకు చంద్రబాబు పరామర్శ

వడ్లమూడి సభలో మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణను చంద్రబాబు నాయుడు పలకరించారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం తొండపిలో ఆదివారం రాత్రి కన్నా కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగిన నేపథ్యంలో వేదిక వద్ద కన్నాను చూడగానే చంద్రబాబు ముందుకువచ్చి కన్నా భుజంపై చేయివేసి ఎలా ఉన్నారంటూ పరామర్శించారు. ధైర్యంగా ఉండండి.. మీకు నేను ఉన్నాను.. వారి సంగతి చూద్దాం.. అంటూ భరోసా ఇచ్చారు. ఇదే సమయంలో పక్కనే ఉన్న రాయపాటి శ్రీనివాస్‌ను కూడా చంద్రబాబు పలకరించారు.

చంద్రబాబుకు జనసేననేతల సన్మానం

చంద్రబాబును జనసేన జిల్లా నాయకులు వడ్లమూడిలో సోమవారం సాయంత్రం కలిశారు. శాలువా కప్పి బొకే అందచేశారు. చంద్రబాబును కలిసిన వారిలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులు నేరెళ్ల సురేష్, నాయకులు పార్వతి నాయుడు, నాయబ్ కమల్, వడ్రాణం మార్కండేయబాబు ఉన్నారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు

ముగ్గురు అరెస్టు -60 కిలోల సరుకు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పరిసరాల్లో గంజాయి విక్రయం, అక్రమరవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. బెంగుళూరుకు చందిన కిషోర్ పాలక్షా రెడ్డి, అభినయ్ సుద్ధగుంట, సుమంత్‌కుమార్‌లను సోమవారం అరెస్టు చేశారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి దుర్గా ప్రసాద్ పర్యవేక్షణలో పొత్తూరు క్రేన్ వక్కపొడి కంపెనీ వద్ద వాహనాలనుతనిఖీ చేస్తుండగా ఒక కారులో 48 కిలోలు, మరో కారులో 12 కిలోల గంజాయి పట్టుబడింది. ఈకేసులో మొదటి నిందితుడు కిషోర్ పాలక్ష రెడ్డి బెంగళూరులో కాంట్రాక్ట్ పనులు చేస్తూ గంజాయి మత్తుకు అలవాటు పడి సులభముగా డబ్బులు సంపాదించాలనే దురాశతో మరో స్నేహితుడితో కలిసి ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా అరగొండ గ్రామం వెళ్లి 60 కేజీల గంజాయిని తీసుకొని వచ్చి బెంగళూరు నగరములో అధిక రేట్లకు విక్రయిస్తున్నాడు. బెంగుళూరుకు చెందిన అభినయ్ సుద్దగుంట పాల్య వెంకటేష్ నిర్మాణ రంగంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ గంజాయిరవాణ, విక్రయంలో కీలకపాత్రపోషిస్తున్నారు. అలాగే వీరి స్నేహితుడు సుమంత్ కుమార్ బెంగళూరులో కార్లు అమ్మడం కొనటం పనులు చేస్తూ గంజాయి మత్తుకు అలవాటు పడి సులభముగా డబ్బులు సంపాదించాలనే దురాశతో ఒడిశానుంచి గంజాయిని తీసుకువెళ్తూ వీరితో కలిసి పట్టుబడ్డాడు. రెండు కార్లు, రూ.2.28 లక్షల నగదు స్వాధీనంచేసుకున్నారు. మీడియా సమావేశంలో ఎక్సైజ్ అధికారులు కృష్ణకిషోర్ రెడ్డి, లత పాల్గొన్నారు.

పసుపు రైతుల్ని ఆదుకోండి..

ప్రజాశక్తి-గుంటూరు

ఇటీవల దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో సంభవించిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని కోరుతూ ఆ ప్రాంత రైతులు సోమవారం రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డిని స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వైసిపి రీజినల్ కో-ఆర్డినేటర్స్ కార్యాలయంలో కలిశారు. రైతులు నష్టపోయిన విదానాన్ని ఆయనకు వివరించి, ప్రభుత్వ పరంగా రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. దీనిపై ఎంపీ స్పందించి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. అవకాశం ఉన్న మేరకు రైతులను ఆదుకోవాలని కోరారు. ఘటనపై పూర్తిగా విచారణ జరిపించి, రైతుల్ని అదుకునేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రైతులు వెంకటరామయ్య, వెంకట శివసాంబిరెడ్డి, చంద్రశేఖరరావు పాల్గొన్నారు.



ఆళ్ళ అయోధ్యరామిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

నేడు దుగ్గిరాలకు విచారణ బృందం?

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై విచారణ నిమిత్తం తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్ ఆధ్వర్యంలో విచారణ బృందం మంగళవారం ఉదయం 10.30 గంటలకు దుగ్గిరాలకు వస్తున్నట్లు తెలిసింది. బృందంలో రెవెన్యూ శాఖతో పాటు వ్యవసాయ, అగ్నిమాపక, పోలీసు, మార్కెటింగ్, వాణిజ్య పంటలు, పరిశ్రమ తదిత శాఖ అధికారులు, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్, నాబార్డ్ అధికారులు ఉన్నట్లు సమాచారం.

అమరావతికి పూర్వవైభవం తెస్తా



మొదటి పేజీ తరువాయి

చిత్తు చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రన్న బీమా, పండుగ కానుకలు, పెళ్లి కానుకలు లాంటి దాదాపు 130 పథకాలు రద్దు చేశారన్నారు. ప్రపంచంలో ఎక్కడా ఎప్పుడూ ఎవరూ చేయని సాహసం అమరావతి రైతులు చేస్తే అమరావతిపై కులం ముద్ర వేశారని, లక్షల మందికి ఉపాధినిచ్చే అమరావతిని నాశనం చేశాని విమర్శించారు.

ఎమ్మెల్యేలపై విరుచుకుపడ్డ చంద్రబాబు

పొన్నూరు కిలాడీ.. గ్రావెల్ రోశయ్యగా మారాడు. పొన్నూరు గ్రావెల్ ఫీల్డ్ తయారు చేశాడు. కేజీఎఫ్‌ని మరిపించేలా ఖిలాడీ తవ్వేశాడని ఎమ్మెల్యే రోశయ్యపై చంద్రబాబు నిప్పులు చెరిగారు. 700 ఎకరాల్లో రూ.2 వేల కోట్ల విలువైన మట్టి అమ్మేశాడన్నారు. గుంటూరు పాడి రైతుల ఆత్మగౌరవానికి నిలువెత్తు సాక్ష్యమైన సంగం డెయిరీపై దాడి చేశారని, చైర్మన్ నరేంద్రను జైల్లో పెట్టారని, ఇందుకు వైసిపి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆర్‌కె తమపై ఎన్నో కేసులేశాడని, జగన్‌కు ఎంతో నమ్మకంగా ఉన్నాడని అయినా ఆయన్ను ఒక తన్నుతన్నాడని ఎద్దేవా చేశారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా.. గంజాయి, గుట్కా, డ్రగ్స్ లాంటి చేయని వ్యాపారం లేదని, పనిమనిషి కొడుకు టిడిపి నేతలతో తిరిగాడని తల్లిపై తప్పుడు కేసు పెట్టాడని ఆరోపించారు. టిడిపి నుంచి వెళ్లిన మద్దాలి గిరి ఇప్పుడు చిత్తుకాగితాం అన్నారు. చిలకలూరిపేటలో చెత్తగా మారిన రజిని గుంటూరులో బంగారం అయిపోతుందా? అని ఎద్దేవ చేశారు. ప్రత్తిపాడుకు చెందిన మాజీ హోం మంత్రి.. దిశ చట్టం ఉందని చెప్పేవారని, ఎక్కడ అంటే సమాధానం లేదని, పదవులిప్పిస్తామని సొంత పార్టీ వారి దగ్గర డబ్బులు లాక్కోవడం తప్ప సుచరిత ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. తెనాలి ఎమ్మెల్యే మున్సిపల్ సిబ్బందిని ఇంట్లో పని మనుషులుగా వాడేస్తాడన్నారు. కంకర నుండి ఇసుక వరకు ఏదీ వదలడన్నారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణపై అంబటి రాంబాబు రాళ్ల దాడి చేయించారని, ఆంబోతు అంబటికి కళ్లెం వెస్తానని ఆగ్రహంగా మాట్లాడారు. మాచర్లలో దుర్గారావు అనే మత్స్యకార కార్మికుడు పార్టీ మారను అన్నందుకు వేధించి ఆత్మహత్య చేసుకునేలా వేధించాడని, పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కొట్టి, భయపెట్టి వేధింపులు భరించలేక చనిపోయాడు. అదే మాచర్లలో తోట చంద్రయ్య వైసిపికి జై కొట్టమంటే కొట్టనందుకు పీక కోసి చంపారని, ఇలాంటి వేధింపులతో బలైపోయిన వారంతా తిరుగుబాటు చేయడం తధ్యమని హెచ్చరించారు.

మూడు ప్రాంతాలూ ఏకమై.. జగన్ రెడ్డి రెక్కలు విరగ్గొట్టాలి

జగన్ రెడ్డి పార్టీ ఫ్యాన్ మూడు రెక్కలు విరగ్గొట్టేందుకు ప్రజలంతా ఏకమవ్వాలని, బాదుడే బాదుడు రెక్కను ఉత్తరాంధ్ర వాళ్లు విరగ్గొట్టాలని. విధ్వంసాల రెక్కను రాయలసీమ వాసులు విరగ్గొట్టాలని, హింసా రాజకీయాలను కోస్తా వాసులు విరగ్గొట్టాలని, రెక్కల్లేని ఫ్యాన్ తాడేపల్లిలో కూర్చోబెట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగాలొస్తాయనే పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి 4 లక్షల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిచ్చే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. పొన్నూరులో ఉండి.. కాలిఫోర్నియాలో ఉద్యోగం చేసుకుందాం.. వర్క్ ఫ్రం హోం విధానంలో ఉద్యోగాలు పొందుదాం.. మండల కేంద్రాల్లో వర్క్ స్టేషన్లు కట్టించి అక్కడే కలిసి పని చేసుకునే సదుపాయం కల్పిస్తాం.. అని చెప్పారు. ప్రతి గడపనా రా కదలి రా అనే నినాదం వినిపించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. సభలో జనసేన, టిడిపి జెండాలను పట్టుకుని చంద్రబాబు ఊపారు. రెండుపార్టీల కలయిక రాష్ట్రానికి చారిత్రక అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంపి కనకమేడల రవీంద్రకుమార్, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్, సంగం డెయిరీ చైర్మన్ దూళిపాళ్ల నరేంద్రకుమార్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్, జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద్‌బాబు, నన్నపనేని రాజకుమారి, మాకినేని పెద రత్తయ్య, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టిడిపి నాయకులు రాయపాటి శ్రీనివాస్, నశీర్ అహ్మద్, కోవెలమూడి రవీంద్ర, బి.రామాంజనేయులు తదితరులు ప్రసంగించారు.

ఊరూరా చైతన్య కార్యక్రమాలు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : జన విజ్ఞాన వేదిక, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఊరూరా జనవిజ్ఞానం ఘంటసాల సాంస్కృతిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.వెంకటేశ్వరరెడ్డి వెల్లడించారు. సోమవారం మండల కేంద్రమైన కాకుమానులో జరిగిన సన్నాహ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఊరూరు సామాజిక అంశాలు చైతన్య గీతాలతో సంగీత విభావరి నిర్వహిస్తున్నామన్నారు. 75 ఏళ్ల భారత రిపబ్లిక్ దినోత్సవాల్లో భాగంగా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర నేటి సమాజంలో ప్రజలకు బాలలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బాలల, విద్యార్థులు, యువత చైతన్యం కోసం గ్రామీణ బాలోత్సవాల ఆవశ్యకత గురించి వివరించారు. ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక 13వ జాతీయ మహాసభలు. మేలో చత్తీస్‌గడ్‌లో జరగనున్నాయని, ఈ సందర్భంగా ఏపీలో 100 కేంద్రాల్లో ఘంటసాలపై విస్తృత ప్రచార ఉద్యమం కమిటీల నిర్మాణం చేయాల్సి ఉందని అన్నారు. అనంతరం ఊరూరు జన విజ్ఞానం కరపత్రాలను ఆవిష్కరించారు. ఘంటసాల చైతన్య వేదిక పెదనందిపాడు కన్వీనర్ జె.కోటేశ్వరావు, చింతా కిరణ్ కుమార్, ఉషారాణి, రమేష్‌బాబు, బి.సుధీర్‌కుమార్, ఎం.శ్రీరాములు, సుబ్బారావు, కొల్లా శేషగిరి, డి.ఆరోను పాల్గొన్నారు.

నూతన ఎస్‌పిగా తుషార్ దూడి

మొదటి పేజీ తరువాయి

ఆందోళన కారులను మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వచ్చాయి. సిఎం, ఇతర విఐపిలు అధికంగా ఉండే తాడేపల్లి ప్రాంతంలోనే నేరాల అదుపుపై దృష్టి సారించలేకపోవడం కూడా భద్రతా వైఫల్యానికి నిదర్శనంగా నిలిచింది. పలుమార్లు సిఎం నివాసం ముట్టడికి పిలుపునిచ్చినా ఆందోళనకారులు అక్కడికి చేరువగా వెళ్లేవరకు నియంత్రించలేకపోయారని ఉన్నతాధికారుల నుంచి అసంతృప్తి గురయ్యారు. అవినీతి చేయకపోయినా కిందిస్థాయి అధికారుల అవినీతిని నియంత్రించలేకపోవడం పెద్ద వైఫల్యంగా నిలిచింది. ప్రధానంగా స్పెషల్ బ్రాంచిలో అవినీతి అక్రమాలపై మీడియాలో కథనాలు వచ్చిన తరువాత విచారణ చేసి చర్యలు తీసుకున్నారు.

నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి

మొదటి పేజీ తరువాయి

పరీక్షల కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు పంపించారు. నిందితుని కోసం గ్రామంలో గాలింపు చేపట్టిన పోలీసులకు చిక్కకుండా పొలాల్లోకి పరుగులు తీసి దాక్కున్నాడు. అయితే సోమవారం నాటికి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలికను వైదనిందితుడు గోపిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

వరికపూడిశెల పనులు ప్రారంభించండి

మొదటి పేజీ తరువాయి

బి.వీరయ్య మాట్లాడుతూ బుధవారం జరిగే మంత్రి మండలి సమావేశంలో వరికపూడిశెల ప్రాజెక్టు గురించి చర్చించి, బడ్జెట్ కేటాయించే విధంగా తీర్మానించాలని, వచ్చేనెల మొదటి వారంలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనూ రూ.1600 కోట్లు కేటాయించి, చట్టబద్ధత కల్పించాలని కోరారు. ప్రాజెక్టుకు సిఎం శంకుస్థాపన చేసి ఇప్పటికే 77 రోజులైందని, అయినా ప్రభుత్వం నుండి సరైన స్పందన లేదని చెప్పారు. ఇప్పటికైనా పనులను ప్రారంభించకుంటే ఆందోళన కార్యక్రమాలకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. మంత్రి రాంబాబు స్పందిస్తూ ప్రాజెక్టు నిర్మాణం తన బాధ్యతని చెప్పారు.

మిర్చి యార్డులో ఉచిత భోజనం ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

యార్డులో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. టోకెన్ల ద్వారా రైతులకు, కూలీలకు ఆహార పానియాలు ఉచితంగా అందిస్తామని యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ తెలిపారు. ఇదిలా ఉండగా కార్యక్రమానికి వ్యవసాయమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, యార్డు పాలకవర్గ సభ్యులు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలపై యార్డులో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి గ్రూపు అసంతృప్తిగా ఉన్నట్టు ప్రచారమవుతోంది.

చిలకలూరిపేటలో వైసిపి బస్సు యాత్ర



ప్రజాశక్తి - చిలకలూరిపేట

రాష్ట్రంలోని పేదలు, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలందరు ధనికులతో సమానంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో సామాజిక సాధికార బస్సు యాత్రను వైసిపి ప్రారం భిం చిందని చిలకలూరిపేట నియోజకవర్గ అసెంబ్లీ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు అన్నారు. సోమవారం స్థానిక కళా మందిర్ సెంటర్‌లో బహిరంగ సభ జరిగింది.

బస్సు యాత్ర స్థానిక ఎఎంజి వద్ద నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి ఎంఆర్‌టి సెంటర్ నుంచి సబ్ రిజిస్టర్ కార్యాల యం వరకు కొనసాగింది. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి,మాజీ శాసనసభ్యులు సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు, మహాత్మాగాంధీ విగ్రహానిక్,జాన్ డేవిడ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సామాజిక సమతా సంకల్ప యాత్ర బహిరంగ సభలో మల్లెల రాజేష్ నాయుడు మాట్లాడారు. ముఖ్య ఆతిథి ఎం.పి.విజయసాయి రెడ్డి మాట్లాడుతూ చిలకలూరిపేట నుంచి వైసిపి అభ్యర్థి నియోజకవర్గ అసెంబ్లీ కో ఆర్డినేటర్ మల్లెల రాజేష్ నాయుడు అని, ఆయన గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పెత్తందార్లుకు.. పేదలకు జరిగే పోరు అన్నారు.బి.సి. సామాజిక వర్గానికి చెందిన తనను గత ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచే ఎంపిక చేసి ఈ స్థాయికి తెచ్చా రన్నారు. పశ్చిమ గుంటూరు రెండు సార్లు జరిగిన ఎన్నికలలో వెనక బడిందని, అందుకనే తనను జగన్ గుంటూరుకు పంపడం జరిగిందన్నారు. అనంతర గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా , ఎమ్మెల్సి చంద్రగిరి ఏసు రత్నం, ఎమ్మెల్సి కుంభ రవి బాబు మాట్లాడారు.మల్లెల రాజేష్ నాయుడు గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్య క్రమంలో ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్., అరుణ, కళ్యాణ చక్రవర్తి.ముస్లిం మైనార్టీల జిల్లా అధ్యక్షులు దరియావాలి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం యువకుడు అరెస్ట్

ప్రజాశక్తి - రెంటచింతల

పోలీసులను చూసి ద్విచక్ర వాహనంపై పారిపోతున్న వ్యక్తిని వెంబడించి 104 క్వార్టర్ల తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.వి నారాయణరెడ్డి తెలిపారు మండలంలోని జెట్టిపాలెం గ్రామానికి చెందిన నిందితుడైన కట్టబోయిన నరసింహారావును అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

మత్స్యకారుని మృతి ఘటన

పోలీసులపై ఆరోపణలు అవాస్తవం

రూరల్ సీఐ సమీముల్లా

ప్రజాశక్తి - మాచర్ల



వెల్దుర్తి మండలం బంగారు పంట తండాకు చెందిన మత్స్యకారుడు దుర్గారావు మృతిపై పోలీసుల వేధింపులే కారణమని చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమని రూరల్ సీఐ సమీముల్లా అన్నారు. స్థానిక రూరల్ సీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుర్గారావు ను కొంతమంది రాజకీయ ప్రలోభాలకు వాడు కొని లబ్ధి పొందేందుకు పోలీసులపై అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. దుర్గారావు ఆదివారం తెల్లవారుజామున చేపల వేటకు బయలుదేరి తన మరపడవను స్టార్ట్ చేయగా తాడు దానికి చుట్టుకుని ప్రమాదవశాత్తు మెడకు చుట్టుకోవడంతో అతను చనిపోయాడని, తమకు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలిసిందన్నారు. దుర్గారావు తెలంగాణ మద్యం తీసుకు వచ్చి ఆ ప్రాంతంలో అమ్ముతుండటంతో అతనిపై కేసులు నమోదయ్యాయని, ఆ యా కేసులలో అతను హైకోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకున్నట్లు చెప్పారు. నిబంధన ప్రకారం స్టేషన్ లో నెలకు మూడుసార్లు సంతకాలు పెట్టాల్సి ఉందని, ఆదివారం కూడా అతను సంతకం పెట్టాల్సి ఉందన్నారు. గత రెండు వాయిదాలకు అతను సంతకాలు పెట్టేందుకు రాలేదని, మూడోసారి సంతకం పెట్టేందుకు రావాలని విధులలో భాగంగా పోలీసులు అతనికి సమాచారం ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. పోలీసులు ఎప్పుడు ఎవరిని తెలుగుదేశం పార్టీని వీడి వైసీపీలో చేరాలని గాని, ఆ కండువా తీసేసి ఈ కండవా కప్పుకోమని బెదిరించడం కానీ చేయలేదని స్పష్టం చేశారు. ఈ కేసులో పూర్తి విచారణ జరుగుతోందని, దుర్గారావు మృతదేహానికి పోస్టుమార్టం పూర్తందని చెప్పారు. మృత దేహాన్ని నదిలోంచి బయటకు తీసినప్పుడు వారు మాట్లాడిన మాటలు తర్వాత మృత దేహాన్ని తీసుకువచ్చి వెల్దుర్తి స్టేషన్ ముందు పెట్టి ఆందోళనకు దిగినప్పుడు మాట్లాడిన మాటలు చూస్తే స్థానికంగా ఉన్న కొందరు తెలుగుదేశం నాయకులు తమ స్వలాభం కోసం చేసిన పని అని అర్థమవుతోందన్నారు నిజానిజాలు త్వరలోనే అన్ని తెలుస్తామని, కేసులు పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ సీఐ శరత్ బాబు మాట్లాడుతూ ఈ కేసు పట్టణ సిఐగా ఉన్న నాకు అప్పగించడం జరిగిందని నిష్పక్షపాతంగా విచారణ జరుపుతామన్నారు.



మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-బెల్లంకొండ

అనారోగ్య కారణంగా వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చంద్రాజుపాలెంలో జరిగింది. గ్రామానికి చెందిన ఓర్సు జ్యోతి సోమవారం ఉదయం విపరీతమైన కడుపునొప్పితో బాధపడింది. భరించలేకపోవడంతో హాల్లో ఫ్యాన్ కి చీరతో ఉరేసుకొని మృతి చెందింది. తండ్రి తమ్మిశెట్టి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బెల్లంకొండ ఎస్ఐ అమీర్ తెలిపారు. జ్యోతి, సురేష్‌లకు ఆరేళ్ల కిందట వివాహ మైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు		
మిర్చి దిగుమతి	:	105,823
మిర్చి ఎగుమతి	:	98,079
మిర్చి నిల్వ	:	67,096

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 20,000
నెం.5	13,000 - 19,500
273	14,000 - 15,200
341	11,000 - 20,000
4884	11,000 - 15,000
సూపర్ 10	14,300 -18,000
నాన్ ఎసి	
తేజ	8,000 - 21,500
బడిగె	10,500 - 20,000
దేవనూరు డీలక్స్	11,000 - 18,000
తాలుకాయలు	5,000 - 13,000

నరసరవుపేటలో నాల్గో విడత 'ఆసరా' చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహిళలు ఆర్థికంగా స్థిరపడితే కుటుంబ వ్యవస్థ మెరుగైన జీవితం అనుభవించేందుకు అవకాశం ఉంటుందని నమ్మిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏ పథకం అమలు చేసినా మహిళలకు ప్రాధాన్యత ఇస్తారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు.ఎన్నికల హామిలో భాగంగా 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి మహిళల పొదుపు సంఘాల్లో వైసిపి నేరుగా నిధులు జమచేసిందని మహిళల పేరిట బ్యాంకుల్లో అప్పు మొత్తం రూ. 25,570.80 కోట్లను ఆసరా పథకంలో భాగంగా 4 విడతల్లో అందజేయడం ప్రభుత్వ ఔదార్యానికి పొదుపు సంఘాల మహిళలు నీరాజనాలు పలుకుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్ నగర్ టౌన్ హాల్లో 4వ విడత "వైఎస్ఆర్ ఆసరా" పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి వైసిపి నాయకులతో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నాటికి ఎస్ఎల్‌బీసీ గణాంకాల ప్రకారం 78,94,169 మంది మహిళల పేరిట రూ. 25,570.80 కోట్లు పొదుపు సంఘాల రుణాలు ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీ మేరకు వైసిపి 2020 సెప్టెంబర్ 11న మొదట విడతగా రూ. 6,318.76 కోట్లు, 2021 అక్టోబరు 7న రెండో విడతగా రూ.6,439.52 కోట్లు, 2023 మార్చి 25న మూడో విడతగా రూ.6,417.69 కోట్లు చెల్లించిందన్నారు. తాజాగా ఈ నెల 23 నుండి నాలుగో విడత రూ. 6,394.83 కోట్లు మహిళల ఖాతాలో జమ చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు రుణాలన్నీ మాఫీ చేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చాక మాఫీ చేయకుండా మోసం చేసిందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అమలు చేయడంతో మహిళలు వివిధ రూపాల్లో తమకు కృతజ్ఞలు చెబుతున్నారన్నారు.



లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలం మాచాయపాలెంలో పశు గ్రామీణ అభివృద్ధి, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమాన్ని మండల ఎంపిపి చెన్నప్పరెడ్డి పద్మ వెంకటేశ్వర రెడ్డి ప్రారంభించారు. మండల ఎంపిపి మాట్లాడుతూ రైతుల తమ లేగ దూడలను శాస్త్రీయ పద్ధతిలో పెంచి డాక్టర్ల సూచన ప్రకారం పోషించుకోవాలని అన్నారు. పశుసంవర్ధక శాఖ సహాయ సం చాలకులు డాక్టర్ జి.వీరయ్య మాట్లాడుతూ వైయస్సార్ పశు బీమా చేయించుకోవాలని అన్నారు. డాక్టర్ బాల కృష్ణారెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, బెల్లంకొండ వెటర్నరీ అ సిస్టెంట్ సర్జన్ తగు సూచనలు చేశారు. గేదెలకు గర్భకోశ వ్యాధులు, పరీక్షలు చేశారు. లైవ్ స్టాల్ అసిస్టెంట్ టి. ఐతంరాజు పాల్గొన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-దాచేపల్లి

పట్టణంలోని హాస్టల్స్ విద్యార్థులకు రెన్యూ ఎనర్జీ గోబల్ పీఎల్సి కంపెనీ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ గణాంకాల ప్రకారం చలికాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని, కొన్ని సందర్భాల్లో అవి మరణాలకూ దారి తీస్తున్నాయని తెలిపారు.అటువంటి వారిని గుర్తించి దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. శీతాకాలంలో అట్టడుగు వర్గాలకు అండగా ఉండటానికి రెన్యూ సంస్థ ఎల్లపుడూ సిద్ధంగా ఉంటుందని కంపెనీ సహ వ్యవస్థాపకురాలు, ఛైర్‌పర్సన్ వైశాలి నిగమ్‌సిన్హా తెలిపారు. దేశ వ్యాప్తంగా ఒక మిలియన్ దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎవరూ చలితో బాధపడకూడదు అనే ఉద్దేశంతో 2015లో ప్రారంభించబడిన గిఫ్ట్ వార్మత్ ప్రచార కార్యక్రమం దేశంలో తీవ్రమైన చలి కాలంలో ప్రజల అవసరాలు తీర్చటానికి సుస్థిరంగా అభివృద్ధి చెందిందన్నారు.



వినుకొండ ఫొటోగ్రాఫర్లకు శివనంది అవార్డులు

ప్రజాశక్తి - వినుకొండ

శ్రీ కాళహస్తి లోని ఎస్వీఎస్ కల్యాణ మండపం లో ఆది వారం జరిగిన ప్రైడ్ ఇండియా కల్చర్స్ నత్యోస్తం కార్యక్రమం. ప్రైడ్ ఇండియా కల్చర్ అండ్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫార్మ్ వారి ఆధ్వర్యంలో వివిధ రంగాలలో అత్యంత ప్రతిభ కనబర్చిన కళాకారులకు అవార్డ్స్ అందజేసి దుశ్శాలవాలతో సత్కరించారు. ఫొటోగ్రఫీ రంగంలో అత్యంత ప్రతిభ కనబర్చిన పల్నాడు జిల్లా వినుకొండ కు చెందిన ఫోటోగ్రాఫర్ లు వంగపల్లి బ్రహ్మయ్య, కేశానపల్లి సుబ్బారావులకు శివ నంది అవార్డ్స్ అందజేశారు. వీరితో పాటు నాట్యం, వైద్య, రంగాలలో ప్రతిభ కనబర్చిన కళాకారులను సన్మానించారు.

ఆర్థిక మోసాలపై ఫిర్యాదులు



పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వై. రవిశంకర్ రెడ్డి

ప్రజాశక్తి - నరసరావుపేట

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రజల నుండి ఫిర్యాదులను ఎస్పి వై. రవిశంకర్‌రెడ్డి స్వీకరించారు. కుటుంబ,ఆర్థిక,ఆస్తి తగాదాలు, ఉద్యోగ మోసాలు మొదలైన సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి(అడ్మిన్) ఆర్. రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పి డి రామ చంద్రరాజు, ఎస్సీ,ఎస్టీ సెల్ డిఎస్పీ షరీఫుద్దీన్, సిఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.

ఇరుగుపొరుగు గొడవలతో కత్తి దాడి



ఇరుగుపొరుగు కుటుంబాల మధ్య జరిగిన చిన్న గొడవల కారణంగా తవ్పై కత్తితో దాడి చేసి కొట్టారని బొల్లా పల్లి మండలం మన్నెపల్లెపాడు తండాకు చెందిన వర్తె దుర్గాబాయి, సంధ్యబాయిలు ఫిర్యాదు చేశారు. ఈ నెల 16వ తేదీన అదే గ్రామానికి చెందిన మూడవత్ భాగ్య నాయక్, అతని కుటుంబ సభ్యులు పదిమంది కలిసి మగవాళ్ళు ఇంట్లో లేని సమయం చూసి గొడవ పెట్టుకున్నారని, ఈ విషయమై బండ్లమోటు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు.దీంతో, నరసరావుపేట డీఎస్పీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేసినా చేసిన పట్టించుకోవట్లేదని చెప్పారు. రాజకీయ నాయకుల అండ చూసుకొని వారు ఈ విధంగా తమ పై దాడి చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.

కొనుగోలు చేసిన స్థలం మరొకరికి

యడ్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సొలసకి చెందిన ఒక మహిళ, అదే గ్రామానికి చెందిన కోటేశ్వరరావు దగ్గర ఆరు సెంట్ల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసింది. ఆ స్థలంలో ఇల్లు కట్టాలనుకుంటే సదరు స్థలం అమ్మిన వ్యక్తి దానిని ఇంకొకరికి కూడా అమ్మినట్లు తెలిసిందని, ఈ విషయమై అతన్ని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నాడని, తిరిగి డబ్బులివ్వడం లేదని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

రిజిస్ట్రేషన్ చేయించుకుని తరిమేశారు



తన మనవరాలు షేక్ హీన,ఆమె తల్లి కలిసి తన పేరిట ఉన్న ఇంటిని వారి పేరుపై రిజిస్టర్ చేయించు కొని, తనని కొట్టి ఇంట్లో నుండి బయటకు పంపేశారని చిలకలూరిపేటకు చెందిన షేక్ కరీమున్న ఫిర్యాదు చేశారు. చదువు రాని తనను మోసం చేసి, ఇల్లు వారి పేరు మీద రాయించుకున్నారని, తాను కేన్సర్ పేషెంట్‌నని చెప్పారు. చిలకలూరిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఉద్యోగం పేరిట మోసం

రాజుపాలెం మండలానికి చెందిన ఒక మహిళ సుమారు మూడేళ్ల క్రితం ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన ఇద్దరు మహిళలకు రూ.30 వేలు ఇప్పిస్తే వారు మోసం చేశారని ఫిర్యాదు చేసింది. ఉద్యోగం ఇప్పించకపోగా, తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, తనకు న్యాయం చేయాలని కోరారు.

ప్రేమపెళ్లి.. చంపేస్తామని బెదిరింపులు

512. తమది కులాంతం వివాహం మని, తనని, తన కుటుంబసభ్యులను చంపేస్తామని అమ్మాయి తరపు వారు తనను బెదిరిస్తున్నారని సత్తెనపల్లికి చెందిన 24 ఏళ్ల యువకుడు మన్నెం ఆనంద్ ఫిర్యాదు చేశారు. సత్తెపల్లి పోలీస్ స్టేషన్‌లో సిఐకి ఫిర్యాదు చేశానని, అమ్మాయి తండ్రి,తాత తరచూ తనను బెది రిస్తున్నారని చెప్పారు. అమ్మాయిని చం పేసి తనపై కేసు వేస్తామని బెదిరిసు_న్నారని చెప్పారు. అమ్మాయి కుటుంబ సభ్యుల నుండి తనకు, తన కుటుంబానికి అమ్మాయికి రక్షణ కల్పించాలని కోరారు.డిసెంబర్ 26వ తేదీన తాను, పాలేరు పురందేశ్వరి(19) ప్రేమ పెళ్లి చేసుకున్నామని, గొడవలు జరుగు తాయని భావించి వివాహం అనంతరం పోలీస్ స్టేషన్‌కి వెళ్ళామని, అమ్మాయి తరపున కుటుంబ సభ్యులు బంధువులు వచ్చి పోలీస్ స్టేషన్ బయట గొడవ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. గొడవని ఆప డం కోసం పోలీసులు అమ్మాయిని గుం టూరు మహిళా సదన్‌కు పం పించారని చెప్పారు. అయితే, అక్కడి నుంచి అమ్మా యిని వారి కుటుంబ సభ్యులు బలవం తంగావాళ్ళ ఇంటికి తీసుకెళ్లినట్లు చెప్పారు.



మిర్చి వ్యాపారి డబ్బులివ్వట్లేదు

మాచర్ల మండలం లచ్చంబావికి చెందిన కంబాల చిన అంకయ్య పండించిన మిర్చి పంటను గుంటూరు కి చెందిన మిర్చి వ్యాపారి బత్తుల నాగేశ్వరరావుకి విక్రయించగా రూ.13 లక్షలు డబ్బులు ఇచ్చి, మిగిలిన డబ్బులు రూ.22 లక్షలు ఇవ్వకుండా మోసం చేసినట్టు ఫిర్యాదు చేశారు. తనతోపాటు మరికొంత మందిని మోసగించాడని తిరిగి తమకు డబ్బులు ఇప్పించి తగిన న్యాయం చేయాలని ఎస్పీని ఆశ్రయించారు.

తీసుకున్న డబ్బు తిరిగివ్వట్లేదు



మొక్కపాటి వెంకటరామయ్య అనే వ్యక్తి తమ వద్ద రెండేళ్ల క్రితం రూ.5 లక్షలు డబ్బు తీసుకొని ఇవ్వట్లేదని, అడిగితే ఇంట్లో ఎవరూలేని సమయంలో నలు గురు వచ్చి తనపై దుర్భాషలాడి దాడి చేశారని, ఈ విషయమై గురజాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఫలితం లేదని గురజాల మండలం తేలుకుట్లకి చెందిన వెంకా యమ్మ ఫిర్యాదు చేశారు. ముక్కుపాటి వెంకట రామయ్య, మద్దినేని వంశీ, గుత్తి కొండ సురేష్, సాధనాలా హనుమంతరావు పై ఫిర్యాదు చేశానని, రాజకీయ నాయ కుల అండ చూసుకుని వాళ్ళు తరచూ బెది రిస్తున్నార, భయపడిన తాము నరసరావుపేటలో ఉంటున్నామని న్యాయం చేయాలని కోరారు.

ఈపూరు మత్స్య సహకార సంఘం ఎన్నికలు జరిపించండి



మాట్లాడుతున్న మత్స్య సహకార సంఘ సభ్యులు

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రం ఈపూరులోని రాపర్ల వారి చెరువు మత్స్యకార సహకార సంఘం ఎన్నికలు జరిపించాలని మత్స్య సహకార సంఘ సభ్యులు సోమవారం పల్నాడు జిల్లా కేంద్రం స్పందనలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సభ్యులు ఆత్మకూరు వెంకటేశ్వర్లు,ముద్దా శీను మాట్లాడుతూ సహకార సంఘ అధ్యక్షుడు పదవీకాలం 2023 ఫిబ్రవరి తో ముగిసిందని 2023 ఏప్రిల్ 11వ తేదీన ఎన్నికల నిర్వహించేలా మత్స్యశాఖ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయగా ఎన్నికలకు రెండు రోజులు ముందు స్థానిక ప్రజా ప్రతినిధి కోర్టు స్టే ద్వారా ఎన్నికలను అడ్డుకున్నారని ఆరోపించారు. మొత్తం 62 మంది సభ్యులు ఉండగా అధికార పార్టీకి అనుకూలంగా పదిమంది సభ్యులు ఉన్నారనే కారణంతో ఎన్నికలు జరగకుండా అడ్డుకున్నారని, మత్స్య సహకార సంఘం ఎన్నికలు జరిపించాలంటూ తాము కోర్టుని ఆశ్రయించామని తెలిపారు.

సఫాయి కర్మచారులకు రిక్షాలు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సఫాయి కర్మ చారులైన 10 మందికి బల్ల రిక్షా బండ్లు పంపిణీ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎల్.శివ శంకర్ , జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ లు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సఫాయి కర్మచారులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు వెంటనే స్పందించిన ఆయన వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దళిత బహుజన రిసోర్స్ ఉచితంగా ఇచ్చిన బండ్లను చెత్తను సేకరించడమే కాకుండా ప్రత్యామ్నాయ జీవనోపాదులకు ఉపయోగించాలని సూచించారు. ఆరోగ్యాన్ని పాడు చేసే వృత్తిని మానుకొని గౌరవప్రదమైన వృత్తులను చేపట్టాలన్నారు. సఫాయి కర్మ చారుల అభివృద్ధికి కృషి చేస్తున్న డిబిఆర్‌సి సంస్థ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లడి దేవకుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ శామ్యూల్ అనిల్ కుమార్ ని కలెక్టర్ అభినందించారు. అల్లాడి దేవ కుమార్ మాట్లాడుతూ సఫాయి కర్మ చారులకు డిబిఆర్సి నిర్వహిస్తున్న ఆరోగ్య పరిశుభ్రత, సంక్షేమ పథకాల పై సదస్సుల ద్వారా ప్రత్యామ్నాయ జీవనోపాదులపై అవగాహన కల్పిస్తామని, పిల్లల విద్య కోసం అవుట్ డోర్ లెర్నింగ్ సెంటర్స్ వంటి వివిధ కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి ప్రభుత్వ సహాయ సహకారాలు అందేలా చూడాలని కలెక్టర్ ను కోరారు. సంఘం ఆధ్వర్యంలో గుంటూరు నాయుడుపేటలో సఫాయి కర్మ చారుల పిల్లల విద్య కోసం ప్రభుత్వ అధికారులతో మాట్లాడి అంగన్వాడీ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు పొందేందుకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. పిల్లలు చెత్తను సేకరించే వత్తికి వెళ్లకుండా బాలివివాహాలు చేసుకోకుండా ప్రభుత్వ సంక్షేమ వసతి గహాల్లో చేర్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్.డి.ఎ పిడి బాలు నాయక్,డి.బి.ఆర్సి ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లడి దేవకుమార్,ప్రోగ్రాం మేనేజర్ చుక్కా శామ్యూల్ అనిల్ కుమార్, రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, నరసరావుపేట సిటీ కోఆర్డినేటర్ వేణు, ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




బల్ల రిక్షా బండ్లు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్

పెన్షనర్ల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

గౌరవప్రదమైన జీవితాన్ని దూరం చేస్తున్నారు - గుంటూరు కలెక్టరేట్ ఎదుట, పల్నాడులో భారీ ధర్నాలు, పల్నాడు కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

పెన్షనర్ల సమస్యలపై సోమవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని స్టేషన్ రోడ్డ గాంధీ పార్కు వద్ద ధర్నాచౌక్‌లో ధర్నాలు చేశారు. పల్నాడు ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. గుంటూరులో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కె.నరసింహారెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించగా పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నాలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పాల్గొని మద్దతుగా మాట్లాడారు. దాదాపు 30 ఏళ్లపాటు ప్రభుత్వ సేవలు అందించిన రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. పెన్షనర్ల డిమాండ్లు న్యాయమైనవని, వారి సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ కృషి చేస్తుందని చెప్పారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని, పరిష్కారం అయ్యే వరకూ అండగా ఉంటామని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వృద్ధులైన పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వం కనికరం చూపట్లేదన్నారు. 11వ పిఆర్‌సిలో తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను తిరిగి గతంలో ఇస్తున్నట్లుగా 70 ఏళ్ల నిండిన వారికి 10శాతం, 75 ఏళ్ళ నిండిన వారికి 15 శాతం పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డిఆర్ బకాయిలు, 11వ పిఆర్‌సి ఎరియర్లు విడుదల చేయాలని, హెల్త్ కార్డుల ద్వారా అన్ని వ్యాధులకూ వైద్యం అందించాలని, మెడికల్ రియంబర్స్‌మెంట్ పరిధి రూ.2 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎపి జెఎసి జిల్లా చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు, ఎపిఎన్‌జిఒ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సతీష్ ధర్నాకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాసు మాట్లాడుతూ డిమాండ్ల సాధించుకునే వరకూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 5న విజయవాడలో జరిగే రాష్ట్ర వ్యాప్త ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ధర్నాలో కోశాధికారి శర్మ, ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్.నాగూర్‌షరీఫ్, ఎపిఎన్‌జిఒ మాజీ రాష్ట్ర అధ్యక్షులు బి.సాంబిరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కె.జోజయ్య, తదితరులు ప్రసంగించారు.

గుంటూరులో ధర్నాకు హాజరైన పెన్షనర్లు... నరసరావుపేటలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

నరసరావుపేటలో నిర్వహించిన ధర్నాలో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మానం సుబ్బారావు మాట్లాడారు. పెన్షనర్ల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. సిపిఎస్ రద్దు చేసి 10 శాతం అదనంగా పెన్షన్ ఇవ్వాల్సి ఉండగా కొత్త విధానాలు తెచ్చి కోతలు విధిస్తున్నారని అన్నారు. 2010లో 11వ పీఆర్సీ, డిఆర్ అలవెన్సులు బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న వైద్య ధరలను అనుసరించి రూ 2 లక్షలకు పరిమితం అయిన మెడికల్ అలవెన్సులు రూ.5 లక్షలకు పెంచాలన్నారు. సకాలంలో పెన్షన్ ఇవ్వడం లేదని, గౌరవప్రదమైన జీవితాన్ని పెన్షనర్లకు దూరం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఆదయ్య, కోశాధికారి రాఘవయ్య, సంఘం నాయకులు ఎమ్‌డి హుస్సేన్, పి.సుబ్బారావు, పి.రమేష్, ఆర్.పురుషోత్తం, సీతారామయ్య పాల్గొన్నారు.

నేటి నుండి రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - దుగ్గిరాల : జగనన్న కాలనీల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మంగళవారం నుండి ప్రారంభం కానున్నదని తహసిల్దార్ కె.మల్లీశ్వరి తెలిపారు. ఏ గ్రామాల పరిధిలో ఇళ్ల స్థలాలు కేటాయించారో ఆ గ్రామాల పరిధిలోని సచివాలయాలలో రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. సోమవారం ట్రైల్ నిర్వహించగా ఫెయిల్ అయ్యిందని, ప్రస్తుతం మళ్లీ ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

డాక్టర్ అనూషకు సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి : ఇందిరా నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ పి.అనూషను కేంద్రం సిబ్బంది సోమవారం సత్కరించారు. డాక్టర్ అనూష గణతంత్ర దినోత్సవంలో జిల్లా కలెక్టర్ నుండి ప్రశంసా పత్రాన్ని అందుకున్న సందర్భంగా సన్మానించారు. హెల్త్ సెంటర్ సూపర్వైజర్ జయలక్ష్మి, స్టాఫ్ నర్సులు జయశ్రీ, వరలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ దీల్షా, సత్యనారాయణ, ఇమ్రాన్ పాల్గొన్నారు.

సాధారణ విద్యార్థులతో పోటీ పడేలా వికలాంగులకు విద్య



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - తెనాలి

వికలాంగులు కూడా సమాజంలో గౌరవ రీతిలో జీవనం సాగించవచ్చని తెలియజేసేందుకే అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహణ ముఖ్య లక్ష్యమని మండల విద్యాధికారి డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక బాలాజీరావుపేట భవిత కేంద్రంలో వరల్డ్ డిజేబిలిటీ డేను సోమవారం నిర్వహించారు. ఎంఇఒ మాట్లాడుతూ మానసిక, శారీరక వైకల్యం కలిగి ఉన్న 5-19 ఏళ్ల వారంతా భవితా సెంటర్లో చేరి, మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. మిగతా విద్యార్థులతో పాటు పోటీ పడేవిధంగా విద్య కొనసాగించడం సంతోషమని, ఆ విధంగా వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, టీచర్లను అభినందించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కఠెవరం జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం టి.శ్రీధర్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ టి.సునీల్, ఐఇడి టీచర్లు వై.రజిని, డి.సునీత, ఉపాధ్యాయులు షేక్ మొహమ్మద్ షరీఫ్, బి.జగన్నాథ నాయక్, మనోహర్, శ్యాంబాబు, శ్రీదేవి, ఫిజియోథెరపిస్ట్ శివనాగమల్లేశ్వరరావు, జయమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లంక భూములు ఇప్పించండి

తహశీల్దార్‌కు వెంకటపాలెం దళిత రైతులు వినతి



ప్రజాశక్తి - తుళ్లూరు

వ్యవసాయం చేసుకొని ఉపాధి పొందేందుకు వీలుగా లంక భూములను పంపిణీ చేయాలని రాజధాని ప్రాంతం వెంకటపాలేనికి చెందిన దళితులు కోరారు. ఈ మేరకు 60 మంది దళితులు సోమవారం తహశీల్దార్ కల్యాణికి విన్నవించారు. వెంకటపాలెం లంక భూముల్లో జొన్న, కూరగాయలు సాగు చేసి ఉపాధి పొందవచ్చని, ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకొని భూములను పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై రాష్ట్ర ఎస్సీ కమిషన్‌ను సంప్రదించావున్నారు. తహశీల్దార్ స్పందిస్తూ లంక భూముల విషయమై ఎస్సీ కమిషన్ నుంచి సమాచారం వచ్చిందని, 296 సర్వే నంబర్‌లో ఉన్న లంక భూముల విషయమై పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు టి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అర్హులైన పేదలకు లంక భూములను ప్రభుత్వం తక్షణమే పంపిణీ చేయాలని కోరారు. వెంకటపాలెంలో లంక భూముల కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు మైక్ ప్రచారం చేయడంతో 300 మంది పైగా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

కలెక్టరేట్‌లో రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

కలెక్టర్ కార్యాలయ ఆవరణలో కాలుష్యరహిత రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎన్ క్యాప్ నిధులతో కలెక్టరేట్ రోడ్ల మరమ్మతులు, ఇన్నర్ రింగురోడ్డు ఏర్పాటు పనులకు జేసీ జి.రాజకుమారితో కలిసి కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ కాలుష్య రహిత నగరాల్లో భాగంగా నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్.క్యాప్) ద్వారా నూతన రోడ్లకు కేటాయించిన రూ.30 లక్షల నిధులతో ఈ పనులు చేపట్టామన్నారు. నిత్యం ప్రజల రాకపోకలు చేసే జిల్లా కలెక్టరేట్, వ్యవసాయ శాఖ, ఆర్‌డిఒ, ఇవిఎం గోడౌన్, రిజిస్ట్రార్ కార్యాలయం, జిల్లా విద్యా శాఖ కార్యాలయం వైపుగా ఇన్నర్ రింగ్ రోడ్‌ను మెయిన్ రోడ్ వరకు నూతన రోడ్డు నిర్మాణం చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్డీఓ లక్ష్మీ కుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, జిఎంసి ఎస్ఈ సుందరామిరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇన్నర్ రింగు రోడ్డు రూటును పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు




నివాళులర్పిస్తున్న నాయకులు.. మృతి చెందిన ఇస్రాయేలు (ఫైల్)

సిపిఎం సభ్యులు ఇశ్రాయేలు మృతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని నిడమర్రుకు చెందిన సిపిఎం సభ్యుడు కట్టెపోగు ఇస్రాయేలు (70) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు భార్య, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇశ్రాయేలు భౌతికకాయంపై నాయకులు సిపిఎం పతాకాన్ని కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎంతోపాటు వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమాలు, కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఇశ్రాయేలు మృతి బాధాకరమని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి అన్నారు. నివాళులర్పించిన వారిలో నాయకులు ఎం.భాగ్యరాజు, కె.ప్రకాశరావు, జి.నాగేశ్వరరావు, కె.వీరయ్య, కె.నాగేశ్వరరావు తదితరులున్నారు. సాయంత్రం నిర్వహించిన అంత్యక్రియల్లో కె.బుల్లబ్బాయి, కె.నానయ్య, ఇ.ఆరోను, కె.వీరయ్య, ఎం.రాజముని, ఎం.సిరిబాబు, యు.నాగరాజు పాల్గొన్నారు.



గ్రూప్-2పై వర్సిటీలో రేపు అవగాహన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 31వ తేదీ బుధవారం వికాస్ భవన్‌లో జరిగే గ్రూప్-2 అవగాహన సదస్సు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ గ్రూప్-2 అభ్యర్థులు పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు అవగాహన కలిగించేలా ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సులో ప్రధాన వక్తగా ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్ రావు పాల్గొంటారని, అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ ప్రెసిడెంట్ సంతోష్, సెక్రెటరీ ఆదిశేషు, సభ్యులు నవిత పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. నియోజకవర్గ స్థాయి మహిళల బ్యాడ్మింటన్ పోటీల్లో తాడేపల్లి మండలానికి చెందిన పి.జాహ్నవి, పి.జయశ్రీ గెలుపొందారు. విజేతలకు పెనుమాక జూనియర్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి, యంటిఎంసి అధ్యక్షులు డి.వేమారెడ్డి ట్రోఫీ, ధ్రువపత్రాలను అందజేశారు.

ట్రోఫీ అందజేస్తున్న చిరంజీవి, వేమారెడ్డి



పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా గిరికుమార్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల




ఎన్నికల బదిలీల నేపథ్యంలో పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ గా గిరి కుమార్ సోమవారం బాధ్యతలు స్వీక రించారు. గతంలో పిడుగురాళ్ల మున్సి పల్ కమిషనర్ గా పనిచేసిన వెంకటేశ్వర్లు గూడూరు డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయినట్లు సిబ్బంది తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన గిరికుమార్ డిఎమ్‌ఓ కార్యాలయంలో విధులు నిర్వహించాలని తెలిపారు. మున్సిపల్ శాఖ సిబ్బంది,కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్పీని కలిసిన ముప్పాళ్ళ నూతన ఎస్సై

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సాధారణ బదిలీల్లో భాగంగా నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న ఎస్.ఐ పి.హజరత్తయ్య ముప్పాళ్ళ పోలీస్ స్టేషన్ కి బదిలీ అయ్యారు. గతంలో రొంపిచర్ల,నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ పనిచేసి ప్రజల యొక్క మన్నలు పొందారు.ఈ సందర్భంగా సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ వై. శంకర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని సూచించారు.



ఎమ్మెల్సీ రాజశేఖర్ పరామర్శ

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని ఉప్పరపాలెం వైసిపిసీనియర్ నాయకులు, పంచాయతి వార్డు మెంబర్ వల్లెపు ఆంజ నేయులుకు ఎమ్మెల్సి మర్రి రాజశేఖర్ నివాళులర్పించారు. పాల్గొన్నారు. ఈ నెల 14వ తేదీన ఆంజనేయులు మృతి చెందారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాజశేఖర్, ఆంజనేయులు చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.



చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్‌కు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - వినుకొండ



వినుకొండకు చెందిన సీనియర్ చిత్రకారులు వజ్రగిరి జెస్టిస్ కు మరోసారి ప్రథమ బహుమతి లభించింది. విజయ వాడ ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక,ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో, రైతుల ఆక్రందన- మిచౌంగ్ తుపాను అనే అంశంపై సోమవారం నిర్వహించిన చిత్రకళా పోటీల్లో వినుకొండకు చెందిన జెస్టిస్ వజ్రగిరి గీసిన 'రైతుల ఆక్రందన' చిత్రానికి ప్రథమ బహుమతి ప్రక టించారు. ఫిబ్రవరిలో జరగబోయే కార క్రమం లో ఈ బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జెస్టిస్‌ను స్థానిక మిత్రులు చిత్రకళాకారులు, రాజకీయ ప్రముఖులు, కవులు,రచయితలు, అభినందించారు,

'జగనన్నకు చెబుదాం'కు 206 ఫిర్యాదులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై సకాలంలో స్పందించాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన సమావేశ మందిరంలో 'జగనన్నకు చెబుదాం' స్పందన ఫిర్యాదులను కలెక్టర్ ి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవిన్యూ అధ్యికారి వినాయకం స్వీక రించారు. జిల్లా వ్యాప్తంగా 206 ఫిర్యా దులు అందినట్లు కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. అర్జీదారులు సుదూర ప్రాం తాల నుంచి రావడంతో, వారికి ఇండి యన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా వారి సహకారంతో ఉచిత అన్నదానానికి పట్టణానికి చెందిన బి.వి.నాగేశ్వరరావు సహకారం అందించారు. కలెక్టర్ మాటా ్డుతూ మండల ప్రత్యేక అధికారులు కుల గణనపై దృష్టి సారించి త్వరితగతిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. నవ రత్నాలు లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్ళ పట్టాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మండల పత్యేక అధికారులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, పల్నాడు జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో ఉం చాలని ఆదేశించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్



అసాంఘిక కార్యకలాపాలపై ఫిర్యాదు

గుట్కా, అక్రమరేషన్ తరలింపు, గంజాయి, మట్టి మాఫియా ఎమ్మెల్యే కనుసన్నల్లో జరుగుతున్నాయని, ఉప్పల పాడు సాయి బాలాజీ వెంచర్‌లో 46 ఎకరాల ప్రభుత్వ భూమిని గోపిరెడ్డి శ్రీని వాస్ రెడ్డి అమ్ముకొని సొమ్ము చేసు కున్నారని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప్పలపాడు సాయి బాలాజీ వెంచర్ లో 46 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలపై కలెక్టర్ కు పలు మార్లు ఆధారాలతో ఫిర్యాదు చేశామన్నారు. ఉప్పలపాడు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై కోర్టులోను కేసు వేసి ప్రభుత్వ భూమిని కాపాడేందుకు పోరాడుతున్నామన్నారు.లేఅవుట్ లోని ప్రభుత్వ భూమికి సంబంధించిన ఆధారాలు, ప్లాన్లు చూపిస్తూ గోపిరెడ్డి అమ్ముకోకపోతే చర్చకు రావాలన్నారు. నకరికల్లు అడ్డరోడ్డులో పట్టుబడిన గుట్కా సరఫరా చేస్తూ పట్టుబడిన వ్యక్తులు, అక్రమ రేషన్ బియ్యం తర లింపు దారులు ఎమ్మెల్యే అనుచరులేనని అన్ని ఆధారాలు పోలీసులు వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు.



నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలు ధ్వంసం

కొన్నేళ్ల క్రితం కొనుగోలు చేసిన స్థలంలో స్థిర నివాసాలు ఏర్పరచుకుని ఉంటున్న తమ కుటుంబాలను నివాసం ఉంటున్నామని, అందులో ప్రభుత్వ భూమి ఉందంటూ మున్సిపల్ అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలను ధ్వంసం చేశారని తమకు న్యాయం చేయాలని చాకిరాల మిట్టకు చెందిన బాధితులు చెన్నయ్య,చిన్న మస్తాన్, బేబీ నాగంజలి, సిహెచ్ నాగిరెడ్డి, మహేంద్ర కుమార్, శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది పెద్దలకు కట్ట బెట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. 1952లో నరసరావుపేట జమీం దారుల వద్ద తమ తాతలు, తండ్రులు చాకి రాలమిట్టలో కొంత వ్యవసాయ భూమి కొనుగోలు చేశారని, కాల క్రమం లో నివాస స్థలాలుగా మారాయని కుటుంబ సభ్యులు వాటాలు పంచుకోగా తలా 6 సెంట్ల స్థలం రావడంతో కొన్నేళ్ల క్రితం స్థిర నివాసాలు ఏర్పాటు చేసు కున్నామని వివరించారు. తాము చట్టపరంగా న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు.



పొలం కాగితాలకే పరిమితం

రెవిన్యూ అధికారులు రికార్డులు తారుమారు చేసి విశ్రాంత ఉద్యోగులమని కనికరం లేకుండా ఇబ్బందులు పెడు తున్నారని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని విశ్రాంత ఉద్యోగులు చక్రా వధానుల వెంకట రాయాజీ ధవేజీ, పుణ్యమూర్తుల వర ప్రసాద్, చివుకుల రామలక్ష్మి యశోధర, రామకృష్ణ ప్రసాద్ కోరారు. కావలి జవహర్ భారతి కళా శాలలో ప్రిన్సిపల్‌గా, వివిధ విభాగాలలో పని చేస్తున్న కొందరం ఉద్యోగులం కలిసి వ్యవసాయం చేయాలన్న కోరికతో బొల్లా పల్లి మండలం గుమ్మనంపాడులో సర్వే నెం.54 లో ఉన్న 1100 ఎకరాల వ్యవసాయ భూమిలో 2010 లో 100 ఎకరాల భూమిని మహ్మద్ ముర్తాజా హుస్సేన్, మహ్మద్ యాసిన్ హుస్సేన్, మహ్మద్ జాబిన్ ల వద్ద నుండి కొనుగోలు చేసినట్లు చెప్పారు. వినుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశామని,అయితే 2008 వరకు 8 డాకు ్యమెంట్లుగా ఉన్న 100 ఎకరాల భూమికి గ్రామ అగ్రహారం భూమి ఉమ్మడి యజమాని చిరుమామిళ్ల కోదండరామ వెంకట శేష వర ప్రసాద్ 100 ఎకరాల భూమిని కూడా రెవిన్యూ అధికారులను కలసి భూమి సర్వే చేసి హద్దులు నిర్ణ యించి ఆన్లైన్ లో నమోదు చేయాలని చెప్పినా ఫలితం లేదన్నారు.



మెడికల్ బిల్లులు మంజూరు చేయండి

చిలకలూరిపేట ఆర్టీసీ డిపో అధిక ారుల నిర్లక్ష్యంతో న్యాయ పరంగా రావాల్సిన బిల్లులు ఆగి పోయాయని దీనిపై న్యాయం చేయాలని చిలకలూరి పేటకు చెందిన కండక్టర్ కుమారుడు సిహెచ్ పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆర్టీసి కండక్టర్ గా విధులు నిర్వ హిస్తున్న తన తండ్రి వెంకట ఏడుకొండలు అనా రోగ్యంతో మృతి చెందారని, చికిత్సకు లక్షల రూపాయలు అప్పులు చేశామని మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం దర ఖాస్తు చేసుకుంటే అనారోగ్యంతో ఉన్న తండ్రి బతికితే వస్తుందని చెబుతున్నా రన్నారు. ఆరోగ్య శ్రీ పరిధికి లోబడి అన్ని బిల్లులు రీయింబర్స్‌మెంట్ అధికారులు మంజూరు చేశారని అన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే కన్నా ఆరోపణలు'

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

కేవలం రాజకీయ లబ్ది పొందెందుకే టీడీపీ నాయకుడు కన్నా లక్ష్మీనారాయణ తనపై అసత్య ఆరోపణలు చేయటం విడ్డురంగా ఉందని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వం ఆసుపత్రిలో టిడిపి, వైసిపీ పరస్పరం రాళ్ల రవ్వుకున్న ఘటనలో గాయాలపాలై చికిత్స పొందుతున్న వైసిపీ క్షత గాత్రులను ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముప్పాళ్ళ మండలం తొండపిలో కన్నాపై దాడి కాదని టీడీపీ, వైసిపీ పరస్పరం రాళ్లరవ్వుకున్నారని అన్నారు. తన నేతృత్వంలో ఈ దాడి జరిగిందని, తాను తృటిలో దాడి నుండి తప్పించుకున్నానని కన్నా మాటా ్డటం బాధకారమన్నారు. కేవలం రాజకీయంగా కన్నా తనపై బురద చాల్లే ప్రయత్నంలో భాగంగానే ఈ ఆరోపణలు చేశారన్నారు. తొండపి సమస్యాత్మక గ్రామం అని, గత ఎన్నికల్లో తాను, ప్రస్తుతం రాజీనామా చేసిన ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయులు ఆ గ్రామానికి వెళ్ళినప్పుడు కూడా ఇదే రకమైన ఘటన జరిగిన విషయం కన్నాకు తెలియదేమో అని ఎద్దేవా చేశారు. ఇలాంటి గ్రామాలకు వెళ్ళేటప్పుడు పోలీసుల అనుమతి తీసుకోవాలని, టీడీపీ నాయకులు కనీసం పోలీసులకు సమాచారమే ఇవ్వలేదని అన్నారు. అయినప్పటికీ సకాలంలో పోలీసులు ఘటన స్థలికి చేరుకోవడంతో పరిస్థితిని అదుపులోకి వచ్చిందని అన్నారు. రాజకీయంగా ఇలాంటి ఘటనలను ఖండిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయన్నారు. తాను ఎప్పుడూ ఘర్షణలను ప్రోత్సహించలేదని, అలాంటి తనపై టీడీపీ పసలేని ఆరోపణలు చేసి, ఈ ఘర్షణలకు రాజకీయ రంగుపులిమి ప్రజలు మన్ననలు పొందాలనుకోవటం వారి అవివేక మన్నారు. క్షతగాత్రులు ఎవరూ భయపడవద్దని అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.



ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న రాంబాబు

ఓటమి భయంతోనే దాడి : టిడిపి

ప్రజాశక్తి - నరసరావుపేట

ముప్పాళ్ళ మండలం తొండేపిలో నిన్న సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణపై జరిగిన దాడిని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఖండించారు. రాళ్ల దాడి పై అయన మాట్లాడుతూ వైసీపీ రౌడీ రాజకీయం పరాకాష్టకు చేరిందని ఓటమి భయంతో వైసీపీ నేతలు కల్లు తాగిన కోతుల్లా రౌడీ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.కన్నా లక్ష్మీ నారాయణ పై రాళ్ల దాడి రాంబాబు ఓటమి భయానికి నిదర్శమని కన్నాని ప్రజలు ఆదరించడం చూసి ఓర్వలేక కడుపు మంటతో రాంబాబు రాళ్ల దాడి చేయించారని ఆరోపించారు. **ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్:** స్థానిక రఘురాం నగర్ లో ఉన్న ప్రజావేదికలో టిడిపి నేతలు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వైసిపి నాయకులు ఓటమి భయంతో దాడులకు దిగటం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శన మన్నారు. .తొండపి గ్రామంలో పక్కా ప్రణాళికతో తెలుగుదేశం పార్టీ ర్యాలీపై రాళ్ల దాడి చేయటం పిరికిపంద చర్యగా అభివర్ణించారు.**ప్రజాశక్తి-అమరావతి:** మాజీ మంత్రి, టిడిపి నాయకులు కన్నా లక్ష్మీ నారాయణ, టిడిపి శ్రేణులపై జరిగిన దాడి అమానుషమని జిల్లా తెలుగు రైతు కార్యదర్శి భవిరిశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన అమరావతి లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల తెలుగుదేశం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డారు. **ప్రజాశక్తి-ముప్పాళ్ల:** దాడులను ఖండిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది మైనారిటీలు పార్టీలో చేరికలను ఓర్చుకోలేక భౌతిక దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు.

అంగన్వాడీల పోరాటం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్వాడీల పోరాటం, కార్మిక వర్గానికి స్ఫూర్తిదాయకమని సిఐటియు నగర తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. డొంక రోడ్డులోని సంజీవయ్య నగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆఫీసులో అంగన్వాడీల అభినందన సభ సిఐటియు తూర్పు కమిటీ అధ్యక్షులు టి.రాధ అధ్యక్షతన జరిగినది. శ్రీనివాసరావు ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు కోసం నాలుగున్నరేళ్లుగా అనేక రూపాల్లో ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవటంతో ఇటీవల 42 రోజులు సమ్మె చేశారన్నారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున బెదిరింపులు, నిర్బంధం ప్రయోగించినా పట్టు దలతో, ఐక్యంగా పోరాటం కొనసాగించారని, చివరికి ప్రభుత్వం దిగి వచ్చి డిమాండ్లు అంగీకరించిందని అన్నారు. సభలో ఆటో వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి జి.శంకర్రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి పి.దీవెనరావు, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ జిల్లా కన్వీనర్ సుచరిత, అంగన్వాడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు, నాయకులు కలిసి కేక్‌ను కట్ చేశారు.



కేక్ కట్ చేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు



అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

మండలంలోని వెల్లలూరులో రూ.46 లక్షలతో నిర్మించిన మల్టీ పర్పస్ గోడౌన్, రూ.19 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ప్రభుత్వం చేపట్టిన చర్యలపై వివరించారు. ఎంపిడిఒ శ్రీనివాస్, నాయకులు అంకినీడి చౌదరి, ఆర్.ఆదిశేషులు, సర్దార్, సర్పంచ్ ఐ.మల్లికార్జునరావు, సైపుల్ల, మహమూద్, మాము పాల్గొన్నారు.

అంగన్వాడీలకు బెదిరింపులు : టిడిపి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

చంద్రబాబు సభకు పట్టణంలోని డ్వాక్రా మహిళలు వెళ్లకుండా రిసోర్స్ పర్సన్లు బెదిరించారని టిడిపి పట్టణ అధ్యక్షులు పఠాన్ అహ్మద్ ఖాన్ విమర్శించారు. మున్సిపల్ మేనేజర్ మాటలు విని వారీ పనికి పూనుకున్నారని, టిడిపిఇ అధికారంలోకి వచ్చాక వారందర్నీ తొలగిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.



వైసిపి కార్యాలయంలో కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి క్రిష్టియన్‌పేట వైసిపి కార్యాలయంలో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం మిషన్లు పంపిణీ చేశారు. సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు, పట్టణ అధ్యక్షులు వేణుగోపాలసోమిరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ ఎం.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం కృషిని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు.

విద్యార్థినికి ఎంఇఒ అభినందన

ప్రజాశక్తి-తాడేపల్లి

గుంటూరు మాజేటి గురవయ్య కళాశాలలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి రాత పరీక్షల్లో ద్వితీయ స్థానం సాధించిన నులకపేట ఎంపియుపిఎస్ ఉర్దూ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రజనీని తాడేపల్లి ఎంఇఒ శాంతకుమారి, డి.నాగేశ్వరరావు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలనా ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్ షాజీర్, బ్రహ్మానందపురం పాఠశాల హెచ్ఎం బురన్ పాల్గొన్నారు.



కోల్డ్‌స్టోరేజీ ఘటన బాధిత రైతులకు పరిహారం చెల్లించలేరా?

ప్రజాశక్తి - దుగ్గిరాల

శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు నిల్వచేసి నష్టపోయిన 1200 మంది రైతులకు ప్రభుత్వం రూ.100 కోట్ల నష్టపరిహారం చెల్లించ లేదా? అని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రశ్నించారు స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో సోమవారం టిడిపి - సిపిఐ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద బాధిత రైతుల సదస్సు సోమవారం నిర్వహించారు. ఆనందబాబు మాట్లాడుతూ రూ.100 కోట్ల పంటకు రూ.45 కోట్లు మాత్రమే బీమా చేసినట్లు రికార్డులున్నాయని, ఈ నేపథ్యంలో మిగతా మొత్తాన్ని రైతులకు ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. సిఎం నివాసానికి సమీప ప్రాంతంలో ఘటన జరిగినా ఆయన స్పందిచరా? అని నిలదీశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరావు మాట్లాడుతూ రైతులను అదుకుంటామనే ప్రకటన ప్రభుత్వం నుండి వచ్చే సోమవారం కల్లా రాకుంటే ఆందోళనకు పూనుకుంటామని చెప్పారు. ఇదిలా ఉండగా కొల్లిపర మండలం ఆత్తోటకు చెందిన మహిళ టి.రమాదేవి తన ఆవేదనను చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. 250 క్వింటాళ్లను కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశామని, ఆ తర్వాత భర్త చనిపోయారని, ఇప్పుడు బాకీల వారు వచ్చి అప్పు ఎలా తీరుస్తావంటూ నానా మాటలు అంటున్నారని, ఎలాగైనా పరిహారం ఇప్పించాలని వేడుకున్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎం.వెంకటసుబ్బయ్య, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ ఎం.సుబ్బారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి జె.అజయ్‌కుమార్, నాయకులు పి.జమలయ్య, ప్రసాద్, వెంకటేశ్వరరావు, రంగారెడ్డి, శివయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు, విలపిస్తున్న బాధిత మహిళ (ఇన్‌సెట్)

ముందు తరాలకు మంచి పర్యావరణాన్నిద్దాం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పర్యావరణాన్ని పరిరక్షణ పచ్చదనం, పరిశుభ్రతతో కూడిన ధరిత్రి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం ప్రెసిడెంట్ పావులూరి రాంబాబు అన్నారు. స్థానిక ఐతానగర్‌లో నూతనంగా అభివృద్ధి పరచిన పల్లవి గార్డెన్స్‌లో రోటరీ క్లబ్ తెనాలి ప్రెసిడెంట్ రాంబాబు, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళి కృష్ణ, ఇతర సభ్యులు సోమవారం మొక్కలు నాటారు. స్వచ్ఛమైన పర్యావరణాన్ని యథావిధిగా రానున్న తరాలకు అందించాలనే ఉద్దేశంతో భారీ సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామని కన్నెగంటి మురళీకృష్ణ తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని డాక్టర్ జీవనజ్యోతి కోరారు. ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందని, భావి తరాల జీవితాలను మార్చేందుకు మనమే పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు. ప్రతి మనిషి జీవన విధానంలో మార్పులు రావలసిన అవసరం ఉందని సూచించారు. ఇళ్ల వద్ద మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని కె.లక్ష్మీ జగదీశ్వరాంభ సూచించారు. కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ ఈదర వెంకట పూర్ణచంద్, సెక్రటరీ ఎస్.వెంకటేశ్వరరావు, ఈదర శ్రీనివాస్, గుమ్మడి నారాయణ, కొఠారి, వీరవల్లి మురళి పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

అర కిలో మీటర్లో 9 స్పీడ్ బ్రేకర్లు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఆ రోడ్డులో వెళ్లాలంటేనే ఆటోలు, ద్విచక్ర వాహనదారులు నరకయాతన పడుతున్నారు. సాధారణంగా అతివేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు వేస్తుంటారు. అయితే దీనికి భిన్నంగానూ కుంచనపల్లిలో ఎక్కడంటే అక్కడ ఇవి కనిపిస్తున్నాయి. ఇళ్లల్లోని డ్రెయినేజీ నీరు పోవడానికి పైపులు వేసుకుని వాటికి రక్షణగా పైపుపైన కాంక్రీట్ వేయడంతో అవి స్పీడ్ బ్రేకర్లుగా మారిపోతున్నారు. మరికొందరు తమ ఇళ్ల ముందు ప్రత్యేకంగా స్పీడ్ బ్రేకర్లు వేసుకుంటున్నారు. దీంతో కుంచనపల్లి ప్రధాన రహదారిలో ప్రతి 20 - 30 అడుగులకు ఓ స్పీడ్ బ్రేకర్ దర్శనమిస్తోంది. ఎస్సీ కాలనీలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి గ్రామ సచివాలయం కార్యాలయం వరకు అరకిలో మీటర్ దూరానికి 9 స్పీడ్ బ్రేకర్లున్నాయి. వీటి వల్ల వాహన రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని వాహనదారులు చెబుతుండగా, ద్విచక్ర వాహనాలపై కూర్చువాలంటే ఇబ్బందిగా ఉంటోందని మహిళలు అంటున్నారు. అధికారులు కలుగజేసుకోవాలని కోరుతున్నారు.



పిబిఎన్ కాలేజీలో సిరి డెంటల్ కేర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : పట్టణంలోని పిబిఎన్ కళాశాలలో సిరి డెంటల్ కేర్ ఆధ్వర్యంలో సోమవారం 500 మంది విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు చేశారు. డాక్టర్ నవ్య పరీక్షలు చేసి పలు సూచనలు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. శివకుమారి, మేనేజర్ జగదీష్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ప్రోగ్రాం ఆఫీసర్ డి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న డాక్టర్ నవ్య



కార్యక్రమంలో శ్రీధర్‌బాబు, ఇతర అతిథులు

ఉన్నత స్థాయికి వెళ్లేందుకు కష్టపడాలి

ప్రజాశక్తి-మంగళగిరి

యువత ఉన్నత స్థాయికి ఎదగడానికి పాటుపడాలని ఐఎఎస్ అధికారి శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణంలోని వైష్ణవి కళ్యాణ మండపంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ సిల్క్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కష్టపడి చదవడానికి అలవాటు పడాలని, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ డాక్టర్ ఆది, శ్రీనివాస్ సోన్, ఎం.సుబ్బారావు, వి.రాజేశ్వరి, జి.కస్తూరి, ప్రముఖ వ్యాపారవేత్త ఎన్.నాగేశ్వరావు, జి.వెంకట నరసింహారావు పాల్గొన్నారు.



28వ వార్డులో చిరంజీవి పర్యటన

ప్రజాశక్తి - మంగళగిరి

గుడ్ మార్నింగ్ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి సోమవారం పట్టణంలోని 28వ వార్డులో పర్యటించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో తమకు మద్దతివ్వాలని కోరారు. వైసిపి పట్టణ అధ్యక్షులు ఎం.మల్లేశ్వరావు, నాయకులు టి.శ్రీనివాసరావు, శేషిరెడ్డి, ప్రసన్న, షఫీ, నరసయ్య, ఆదాం పాల్గొన్నారు.

3న పెదవడ్లపూడి సాయి మందిరం వార్షికోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పెదవడ్లపూడి భగవాన్ శ్రీసత్య షిరిడి సాయిబాబా మందిరంలో ఫిబ్రవరి మూడో తేదీన మందిరం 18వ వార్షికోత్సవ మహోత్సవం జరుగుతుందని మందిరం కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం తెలిపారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను మందిరం కళ్యాణ మండపంలో సోమవారం ఆవిష్కరించారు. సుమారు లక్ష మంది హాజరయ్యే మహోత్సవానికి ఉదయం 8 గంటల నుండి అన్నదానాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. సినీ సంగీత గాయని, గాయకులతో సంగీత విభావరి, జబర్దస్త్ కామెడీ షో కళాకారులచే హాస్యవల్లరి, డూప్ స్టార్స్, మిమిక్రీ, మ్యూజిక్ షో తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు వివిధ పుణ్యక్షేత్రాల పీఠాధిపతులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కె.దీపక్, ఎ.రామిరెడ్డి, పి.శ్రీనివాసరావు, ప్రసాద్, జె.రాఘవయ్య, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తదాతకు సేవారత్న పురస్కారం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

తలసేమియాతో బాధపడుతున్న ఎందరో చిన్నారులకు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులకు, రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి రక్తదానం ద్వారా విశిష్ట సేవలు అందిస్తున్న మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరుమలశెట్టి ఉమాశంకర్‌ను, సంస్థ సభ్యులు చిలకపాటి సింహాద్రిని తాసుబెల్లి ఫౌండేషన్ చైర్మన్ శంకర్ నాయుడు సత్కరించారు. ఫౌండేషన్ సిల్వర్ జూబ్లీ వారోత్సవాల్లో భాగంగా విశాఖపట్నం వేదికగా భారత సేవా రత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు.

గుంటూరు కలెక్టర్ స్పందనకు 197 అర్జీలు

ప్రజాశక్తి–గుంటూరు

స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వివిధ సమస్య నుండి అందిన అర్జీలను పరిశీలించి సత్వరమే హేతుబద్ధంగా పరిష్కరించాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి 197 అర్జీలు రాగా వాటిని కలెక్టర్‌తోపాటు సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వాతి, ఆర్డీవో పి.శ్రీఖర్, డ్వామా పీడీ వెంకట శివరామిరెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందిన స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన ఫిర్యాదులు తిరిగి రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రీఓపెన్ అయిన పిటీషన్లను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రత్తిపాడు, తాడికొండ, యంటీయంసీ పరిధిలోని మండలాల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నేటి సాయంత్రంలోపు పూర్తి చేయాలని, మంగళవారం మండల స్థాయి ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

కార్యక్రమంలో డిఆర్‌డిఎ, గృహ నిర్మాణ శాఖల పీడీలు హరిహరనాథ్, వేణుగోపాల్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఎస్ఇ బ్రహ్మయ్య పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

తాగునీరు, పారిశుధ్య సమస్యలను సచివాలయాల్లోనే పరిష్కరించాలి

ప్రజాశక్తి–గుంటూరు

తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలను వార్డు సచివాలయ స్థాయిలోనే పరిష్కారం అయ్యేలా విభాగాధిపతులు, నోడల్ అధికారులు చొరవ చూపాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత గత వారం స్పందనలో అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించి, స్పందన అర్జీలను విభాగాధిపతే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలకు సిఫార్సు చేయాలని ఆదేశించారు. నగరంలోని 206 వార్డ్ సచివాలయాల వారిగా ప్రజలు తమకు స్థానికంగా ఎదురయ్యే సమస్యల పరిష్కారం జరిగేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కమిషనర్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 39 ఫిర్యాదులు అందాయి. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 15, ఇంజినీరింగ్ విభాగం 14, రెవెన్యూ విభాగం 2, ప్రజారోగ్య విభాగం 3, ఉపా సెల్ విభాగం 3, అకౌంట్స్ విభాగం 2 ఫిర్యాదులున్నాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఇ (ఎఫ్ఎసి) సుందర్రామిరెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, సిఎంఓహెచ్ డాక్టర్ డి.ఆషా, ఎంహెచ్ఓ (ఎఫ్ఏసి) మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ పాల్గొన్నారు.



రహదారి భద్రతావారోత్సవాల ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవిఐలు

వివిఐటిలో రహదారి భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి–తెనాలి

వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు పూర్తి అప్రమత్తతతో ఉండాలని తెనాలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు చెప్పారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల పెదకాకాని మండలం నంబూరులో సోమవారం రహదారి భద్రతా వారోత్సవాల అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల బస్సు డ్రైవర్లకు వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాహనాలను రోడ్డుకు ఎడమవైపున మాత్రమే నిలపాలన్నారు. వాహనాల యాజమాన్యం డ్రైవర్లకు ప్రతి మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. డ్రైవర్లు విధిగా లైసెన్సులు కలిగి ఉండాలని, వాహనాలకు సంబంధించి కూడా పూర్తి పత్రాలు ఉండాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రహదారి భద్రతా వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కె.మల్లీశ్వరి, జి.సౌజన్య, వివిఐటి ట్రాన్స్‌పోర్ట్ కన్వీనర్ పివి సురేంద్ర మోహన్‌కుమార్, ఎం.లక్ష్మీవినీత, విద్యార్థులు, అధ్యాపకులు, వివిఐటి రవాణా సిబ్బంది పాల్గొన్నారు.



పసుపు రైతులకు న్యాయం చేయాలి

దుగ్గిరాలలో శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు న్యాయం చేయాలని అగ్ని ప్రమాద బాధిత రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో అర్జీ అందచేశారు. పసుపు పంటకు రైతులకు ప్రస్తుత మార్కెట్ రేటు చెల్లించాలని, స్టోరేజి అద్దెలు, రుణాలు రద్దు చేయాలని, రైతులకు పసుపు పంటకు పూర్తిగా ఇన్సూరెన్స్ ఇవ్వాలని, అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. రైతులకు సంబంధించిన కోల్డ్ స్టోరేజి రికార్డులు స్వాధీనం చేసుకోవాలని, ప్రకృతి విపత్తుల నుండి రైతులకు సహాయం చేయాలన్నారు. అర్జీ ఇచ్చిన వారిలో బాధిత పోరాట కమిటీ కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్య, పసుపు రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.శివసాంబిరెడ్డి, నాదెళ్ల సురేంద్ర, చంద్రశేఖర్‌రావు, లంకిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కళ్లం సీతారామిరెడ్డి, కె.సురేంద్ర పాల్గొన్నారు.

సుందరయ్య నగర్ వాసులకు పట్టాలు ఇవ్వాలి

స్థానిక జిఎంసి పరిధిలోని 41వ డివిజన్, పుచ్చలపల్లి



సుందరయ్య నగర్‌లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్పందనలో అర్జీ అందచేశారు. కాలనీలో 350 మంది పేదలు నివశిస్తున్నామన్నారు. భూమి లేని పేదలు 2007 నుండి ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకొని, మౌలిక సదుపాయాలు లేక ఎన్నో అవస్థలు పడుతూ జీవిస్తున్నామన్నారు. ఇటీవల జిఎంసి వారు రోడ్లు, తాగునీటి సదుపాయం కల్పించారని, విద్యుత్ శాఖ వారు లైట్లు వేశారని అన్నారు. అభ్యంతరాలేమీ లేని భూముల్లో నివాసం ఉంటున్న పేదల స్థలాలలను రెగ్యులర్ చేస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో తమ భూములపై ఎలాంటి అభ్యంతరమూ లేనందున పట్టాలు ఇవ్వాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో నాయకులు ఆది నికల్సన్, మస్తాన్‌వలి, బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, పద్మ, కృపావరం, మురళి, ఆదిబాబు ఉన్నారు.

బీమా సొమ్ము కాజేసిన ఉద్యోగిపై ఫిర్యాదు

తనకు సంబంధించిన బీమా సొమ్మును తప్పుడు ధ్రువపత్రాలతో అక్రమంగా కాజేసిన జిజిహెచ్ ఉద్యోగి ప్రేమ్‌జ్యోతిబాబుపై చర్యలు తీసుకోవాలని స్పందనలో ఫిర్యాదు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో జిజిహెచ్ అధికారులు విచారణ పేరుతో వాయిదా వేస్తున్నారని బాధితుడు, జిజిహెచ్ వైద్యుడు డాక్టర్ గాజుల రామకృష్ణ సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 2013లో బీమా పాలసీ మెచ్యూర్ అయ్యిందని, అప్పుడు తాను తిరుపతిలో ఉన్నత విద్య అభ్యసించటానికి వెళ్లానని, అయితే సంబంధిత బీమా కంపెనీ వారు తన వివరాలు ధ్రువీకరించుకోవటానికి జిజిహెచ్‌కి వెళ్లగా అక్కడున్న ప్రేమ్‌జ్యోతిబాబు అతని వివరాలు కంపెనీకి ఇచ్చాడని, దీంతో బీమా సొమ్ము అతని ఖాతాలోకి జమైందని వివరించారు. దీనిపై గతంలో స్పందనలో ఫిర్యాదు చేసినా సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోకుండా అధికారులు విచారణ పేరుతో జాప్యం చేస్తున్నారన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌ను మరోసారి కలిశానని, వారు సానుకూలంగా స్పందించి, జిజిహెచ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారన్నారు. సదరు ఉద్యోగిని సస్పెండ్ చేయాలని ఆదేశించారని రామకృష్ణ మీడియాకు తెలిపారు.

పొన్నూరులో ఆరు అర్జీలు

ప్రజాశక్తి – పొన్నూరు రూరల్ : తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 6 అర్జీలు అందినట్లు తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ తెలిపారు. ఇంటి పట్టాల కోసం 3, ఒంటరి మహిళ ధ్రువపత్రం కోసం 1, త్రీఫేస్ ఎలక్ట్రికల్ లైన్ గురించి 1, రేషన్ కార్డు కోసం ఒక అర్జీ వచ్చినట్లు వివరించారు. వీటిని సంబంధిత శాఖల అధికారులకు పంపి, పరిష్కారానికి ఆదేశిస్తామన్నారు.

సన్మార్గంలో నడిపించేది నాటకం

గుంటూరు కళాపరిషత్ నాటకోత్సవాల ముగింపు సభలో వక్తలు

ప్రజాశక్తి–గుంటూరు

సమాజాన్ని సన్మార్గంలో నడిపించేంది నాటకం అని గుంటూరు కళాపరిషత్ గౌరవ సలహాదారులు ఆలోకం పెద్దబ్బయ్య అన్నారు. మూడ్రోజులుగా స్థానిక వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో నిర్వహించిన 26వ వార్షిక నాటకోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలోకం పెద్దబ్బయ్య అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా వికాస్ విద్యా సంస్థల డైరెక్టర్ శంకరరావు మాట్లాడుతూ కళాపరిషత్‌కు వికాస్‌కు సంబంధ బాంధవ్యాలు ఉన్నాయన్నారు. రంగస్థల నటులు, దర్శకులు ఎన్.రవీంద్రరెడ్డి మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ గత 26 ఏళ్లుగా కళాపరిషత్ ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు.


డిమాన్క్రసి నాటికలో సన్నివేశం

కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి బి.పూర్ణ మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదని అన్నారు. సభలో కార్యవర్గ సభ్యులు పి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

భార్యను సంతోషపెడితే జీవితం ఇంధ్ర ధనస్సులా సప్తవర్ణాలతో ఉత్సవంగా ఉంటుందని తెలిజెప్పే విధంగా విజయవాడకు చెందిన యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ వారు 'రంగు పడుద్ది' నాటిక ప్రదర్శించారు. ఈ నాటికను మాఢభూషి దివాకరబాబు రచించగా, ఆర్.వాసు దర్శకత్వం వహించారు. రెండో నాటికగా విజయవాడ న్యూస్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ వారు 'డిమాన్క్రసి' నాటిక ప్రదర్శించారు. పచ్చి నిజం చేదుగా ఉన్నా రోగాన్ని నయం చేసే శక్తి దానికి ఉంటుందని, తియ్యటి అబద్ధం రుచిగా ఉన్నా తీవ్ర నష్టం చేస్తుందని నాటిక హెచ్చరించింది. చివరగా అమ్మ విలువను తెలియజేస్తూ 'కౌశల్య సుప్రజా రామా' నాటికను ప్రదర్శించారు. ఈ నాటికకు ఆకెళ్ల శివప్రసాద్ మూలకథ సమకూర్చగా, స్నిగ్ధ నాటకీకరణ చేశారు. గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు.

బైబిల్ మిషన్ మహోత్సవాల్లో

లలితా హాస్పిటల్ ఉచిత ఫస్ట్ ఎయిడ్ క్లినిక్

ప్రజాశక్తి–గుంటూరు : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురు బైబిల్ మిషన్ మహోత్సవాలల్లో లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఉచిత ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ నిర్వహించినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాఘవశర్మ తెలిపారు. నాలుగు రోజులపాటు 24 గంటలూ ఈ క్యాంపు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు, ప్రాథమిక చికిత్స అందించి, ఉచిత మందులు పంపిణీ చేశారు.


ఈ క్యాంపులో డాక్టర్ రాజేష్, డాక్టర్ రాము, నర్సింగ్ సిబ్బంది సుజాత, రాంబాబు, క్యాంపు ఇన్‌ఛార్జి అభిషేక్ పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకల్లో జిఎంసి స్టాల్‌కు మొదటి స్థానం

ప్రజాశక్తి–గుంటూరు: పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గుంటూరు నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన 'సమర్ధవంతంగా వ్యర్థాల నిర్వహణ' స్టాల్ కి మొదటి స్థానం దక్కిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి శంకరన్ హాల్లో జిఎంసి అధికారులకు మెమెంటో అందించారు. ఈ సందర్భంగా జిఎంసి కమిషనర్ డిప్యూటీ కమిషనర్ వెంకట కష్ణయ్య, ఎంహెచ్ఓ (ఎఫ్ఏసి) మధుసూదన్‌లను అభినందించారు.


అధికారులను అభినందిస్తున్న కమిషనర్